క్లుప్తంగా

గొల్లపల్లి సూర్యారావు పరామర్శ


మోరిలో శంకరరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి సూర్యారావు

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం ప్రతినిధి జాన శంకరరావు (బాబ్జీ) యోగక్షేమాలు గురించి ఆ పార్టీ రాజోలు ఇన్ఛార్జ్ గొల్లపల్లి సూర్యారావు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో శంకరరావు కాలుకు ఆపరేషన్ చేయించుకున్నారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఈ మేరకు గొల్లపల్లి పరామర్శించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, జిల్లా కార్యదర్శి ఈద రవిరెడ్డి, విద్యార్థి విభాగం ప్రతినిధి సహదేవ్, నాయకులు కుసుమ చంద్రశేఖర్, బళ్ల వీర్రాజు, చింతా సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మామిడికుదురు: విద్యార్థులు సైన్సులో 100 శాతం మార్కులు సాధించేలా టీచర్స్ కృషి చేయాలని ఎంఈఓలు ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు సూచించారు. మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద సోమవారం పదో తరగతి విద్యార్థుల కోసం స్టేట్ బయో ఫోరం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను అందించారు. పదో తరగతి ఉత్తీర్ణతలో మండలం మరింత ప్రగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.చిరంజీవి, ఏపీబీఎస్‌టీఎఫ్ కోనసీమ జిల్లా మండల కో–ఆర్డినేటర్ చప్పిడి వెంకటేశ్వరరావు, బయోలజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అఖిలపక్ష సమావేశం

ఆలమూరు: మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలంటూ మంగళవారం జరిగే అఖిలపక్ష సమావేశానికి అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని అఖిలపక్ష కమిటీ పిలుపునిచ్చింది. ఆలమూరు మండలం ప్రస్తుతం కొత్తపేట నియోజకవర్గంలోనే కొనసాగినా ప్రభుత్వ శాఖల పరంగా తూర్పుగోదావరిలో విలీనం చేసేందుకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఆలయానికి కుర్చీల అందజేత

మలికిపురం: గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి టేకిశెట్టిపాలెనికి చెందిన రేఖపల్లి నరశింహరావు 25 కుర్చీలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గుండుబోగుల పెదకాపు, పిండి సత్యనారాయణ, అన్నంనీడి సుబ్బారావు తదితరులు పాల్గొని దాతను అభినందించారు.

డంపింగ్ యార్డును తొలగించాలి

అయినవిల్లి: సిరిపల్లి పంట పొలాల మధ్య ఏర్పాటు చేసిన పంచాయతీ డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కోరుతూ అ గ్రామానికి చెందిన పలువురు రైతులు కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సిరిపల్లి జంక్షన్ నుంచి నేదునూరు వెళ్లే దారిలో రైతులందరూ వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. ఈ రోడ్డులో రెండు నెలల నుంచి పంట బోదిని అనుకొని పంచాయతీ సిబ్బంది చెత్త పోగులను తీసుకొచ్చి కుప్పలుగా పెడుతున్నారన్నారు. దీంతో రోడ్డున వెళ్లే వాహనచోదకులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న డప్పింగ్ యార్డ్‌ను తొలగించి వేరే చోటుకు మళ్లించాలని కోరుతున్నారన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అయినవిల్లి: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి సరోవరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా తమ శాఖ పరమైన పురోగతి, సమస్యలపై పూర్తి సమాచారంతో రావాలన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

రావులపాలెం: ప్రమాదవశాత్తు కాలికి గాయమైన బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.13 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన యామన అనంతలక్ష్మి (46) హైదరాబాద్‌కి ఉపాధి కోసం వెళ్లగా.. అక్కడ నెల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోకాలు కింద భాగంలో ఎముక విరిగి నలిగిపోయింది. దీంతో ఆపరేషన్ చేయించాల్సి ఉంది. ఆర్థిక స్తోమత లేక సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో ఆమె తండ్రి రామచంద్రరావుకి చెక్కును అందజేశారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో జిల్లాలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ ఏడాది తగ్గినట్టే తగ్గి నాలుగో సారి కూడా వరదలు రావడంతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, అయోధ్యలంక, సిర్రావారిలంక, అనగర్లంక గ్రామాల ప్రజలకు కూడా పడవలపై ప్రయాణిస్తున్నారు.

మేలైన జన ఔషధి

- గ్రామాల్లో పెరుగుతున్న జనరిక్ మందుల వినియోగం
- బ్రాండెడ్ మాత్రల కొనుగోలుతో ఆర్థిక భారం
- వాటిపై 10 నుంచి 80 శాతం ధరలు తగ్గుదల


షాపులో ఉన్న జనరిక్ మందులు

రావులపాలెం: జనరిక్ మందులు అంటే బ్రాండెడ్ మందులతో సమానమైన క్రియాశీల పదార్థాలను కలిగి ఉన్న మందులు. కానీ తక్కువ ధరకే ఇవి లభిస్తాయి. పేటెంట్ గడువు ముగిసిన తర్వాత ఇతర కంపెనీలు కూడా అదే మందును తయారు చేసి అమ్మవచ్చు. మారిన జీవన శైలి నేపథ్యంలో మానవుడు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నాడు. ప్రైవేట్ దుకాణాల్లో లభ్యమయ్యే మందులు బ్రాండెడ్‌వి కావడంతో అధిక ధరలకు విక్రయిస్తారు. జనరిక్ మందులు, బ్రాండెడ్ మందుల వలె అదే నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉంటాయి. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. సీజనల్ వ్యాధుల ప్రభావం పెరగనున్న నేపథ్యంలో మందుల వినియోగం పెరగనుంది. ఇలాంటి పరిస్థితుల్లో అవగాహన అవసరం. మందుల వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఎన్ఎంసీఆర్ఎంపీ) ఎన్ఎంసీఆర్ఎంపీ నియమావళి–2023ను తీసుకొచ్చింది.

షాపులు, పీహెచ్‌సీల నేపథ్యమిదీ

సామాన్యులకు తక్కువ ధరలకే ఔషధాలను అందించాలన్న ప్రధాన లక్ష్యంతో 2015లో జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేసినప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వాటి సంఖ్యను విస్తృతపర్చలేదు. కొత్తపేట నియోజకవర్గంలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. రావులపాలెం మండలంలో ఊబలంక, గోపాలపురం, ఆత్రేయపురం మండలంలో ఆత్రేయపురం, ర్యాలీ, కొత్తపేట మండలంలో అవిడి, వాడపల్లి, ఆలమూరు మండలంలో పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీలు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ఉన్నాయి. అలాగే ఒక ఏరియా ఆస్పత్రి కొత్తపేటలో, 30 పడకల ఆస్పత్రి ఆలమూరులో ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుతుంది. వాటికితోడు విస్తారంగా ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. రావులపాలెం మండలంలో రెండు, కొత్తపేటలో ఒకటి జనరిక్ మందుల షాపులు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో జనరిక్ షాపులున్నాయి.

ధరల్లో వ్యత్యాసాలిలా..

ప్రైవేటు షాపులలో మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నప్పటికీ ఆ ఎమ్మార్పీ రేటు నిర్ధారణలోనే కంపెనీలు లాభార్జనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్ దారులు ఇలా పలు చేతులు మారాల్సి ఉండటంతో ధర అధికంగా ఉండటానికి ఓ కారణమంటున్నారు. ప్రైవేట్ షాపుల విక్రయాలతో పోలిస్తే జనరిక్ దుకాణాల్లోని మందుల ధరలు 10 నుంచి 80 శాతం పైగా తక్కువ ఉంటుంది. పారాసిటమాల్ 10 మాత్రల ధర జనరిక్ షాపులో రూ.12 కాగా, ప్రైవేట్ షాపులో రూ.20 నుంచి రూ.30 ఉంటుంది. బీపీ 10 మాత్రల ధర జనరిక్‌లో రూ.12, బ్రాండెడ్‌లో రూ.80, షుగర్ 10 మాత్రలు రూ.15, బ్రాండెడ్‌లో రూ.50, జింక్ మల్టీ విటమిన్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.20, బ్రాండెడ్‌లో రూ.105, గ్యాస్ట్రిక్ 15 మాత్రలు రూ.15 ఉండగా.. బ్రాండెడ్‌లో రూ.135, సి.విటమిన్ పది మాత్రల ధర రూ.40 కాగా, ప్రైవేట్ షాపులో రూ.70, డి.విటమిన్ నాలుగు కాప్సుల్స్ ధర జనరిక్‌లో రూ.40 ఉండగా, ప్రైవేట్‌లో రూ.90 ఇలా అనేక మందుల ధరల్లో భారీగా వ్యత్యాసాలున్నాయి.

ఎన్ఎంసీఆర్ఎంపీ నిబంధనలిలా

జనరిక్ మందులు రాయాలంటూ 2002లోనే భారత వైద్య మండలి (ఐఎంసీ) నిబంధనలను రూపొందించినప్పటికీ రాయకపోతే తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావించలేదు. 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఎన్ఎంసీఆర్ఎంపీ) నియమావళి– 2023ను తీసుకురాగా.. అది అమల్లోకి తెచ్చినట్టు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. దాని ప్రకారం రోగులకు చౌకగా లభించే జనరిక్ మందులు రాయాలని, రాయని వైద్యులపై లైసెన్స రద్దు చేయడం లాంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసింది.

> **జనరిక్ షాపులోనే మందులు కొనుగోలు చేస్తాం**
>
> 
>
> వైద్యులు జనరిక్ మందులు మంచివని చెప్పారు. నాణ్యతపై అపోహలు వీడాలని సూచించారు. నాణ్యమైన మందులు సాధారణ షాపుల కంటే తక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. నా కుటుంబ సభ్యుల కోసం నేను జనరిక్ షాపులోనే మందులను కొనుగోలు చేస్తున్నాను.
>
> – గుత్తుల పల్లంశెట్టి, రావులపాలెం

కొత్త రేషన్ కార్డుల్లో జిల్లా పేరు మార్చాలి


అంబాజీపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


సఖినేటిపల్లి గ్రీవెన్స్‌లో అర్జీ ఇస్తున్న సరెళ్ల

అంబాజీపేట: రేషన్ కార్డులపై జిల్లా పేరును తప్పుగా ముద్రించిందని, తక్షణమే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ముద్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంబాజీపేట మాల మహానాడు నాయకులు కోరారు. అంబాజీపేటలో తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు, నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ చినబాబుకు వినతిపత్రం అందజేశారు. రేషన్ కార్డుల ముద్రణకు మూలమైన ఆధార్ కార్డులపై కూడా జిల్లా పేరును మార్చాలని కోరారు. అనంతరం అమలాపురంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నూకపెయ్యి చిన్న, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: కొత్త రేషన్ స్మార్ట్ కార్డుల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదులుగా ముద్రించిన తూర్పుగోదావరి జిల్లా పేరును తక్షణం మార్చాలని సోమవారం గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఒక ఫిర్యాదు అందింది. రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు సరెళ్ల విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు యూత్ సభ్యులు ఈ అర్జీని ఎంపీడీవో కే.సూర్యనారాయణ, తహసీల్దారు వెంకటేశ్వరరావుకు ఇచ్చారు.

ఇసుక కేసులు ఉపసంహరించుకోవాలి

అంతర్వేదికరలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై నమోదు చేయాల్సిన కేసులను అమాయకులైన దళితులపై నమోదు చేస్తున్న కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన అర్జీని గ్రీవెన్స్‌లో ఇచ్చారు. ఈ మేరకు గ్రామానికి చెందిన బాధితులతో కలసి అర్జీని తహసీల్దారుకు అందజేశారు.

వేతనాలు చెల్లించాలని అర్జీ

సఖినేటిపల్లి: మండల ప్రజాపరిషత్‌లోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో ప్రజాప్రతినిధులు ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దారు వెంకటేశ్వరరావుకు ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీలు రాపాక దీవెన కుమారి, నల్లి రత్నకుమార్, కో–ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్ అర్జీ ఇచ్చారు. కాగా, 2023 సెప్టెంబర్ నుంచి 2025 ఏప్రిల్ వరకూ సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో గౌరవ వేతనం (రూ.13,20,000) బిల్లులు ఇచ్చి ఉన్నట్టు తెలిపారని, అయితే నేటికీ కూడా సదరు బిల్లుల డబ్బులు తమ ఖాతాలకు జమకాలేదని కూడా ఆ పత్రంలో వారు పేర్కొన్నారు.

అయినవిల్లి: స్మార్ట్ రేషన్ కార్డులో జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరు కాకుండా తూర్పుగోదావరి జిల్లాగా రావడం ఇది పూర్తిగా కుట్రపూరితమేనని మాల మహానాడు మండల అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో గిడ్ల వెంకటేశ్వరరావు పలువురు మాల మహానాడు నాయకులతో వినతిపత్రం అందజేశారు. జిల్లా పేరును అవమాన పరిచే విధంగా ఫ్లెక్సీలు, నేమ్ బోర్డులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. తక్షణమే స్మార్ట్ రేషన్ కార్డులో జిల్లా పేరును ముద్రించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రైవేటీకరణ పేరుతో కూటమి దోపిడీ

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ప్రైవేటీకరణ పేరుతో జాతీయ సంపదలైన వైద్య కళాశాలలతో కూటమి నేతలు దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేసి కేంద్రం నుంచి అనుమతి తీసుకుని రూ.6వేల కోట్లతో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేయగా.. వాటిలో 6 కళాశాలల నిర్మాణం పూర్తైందన్నారు. మిగిలిన కళాశాలలు చివరి దశలో ఉన్నాయన్నారు. అని జిల్లాల్లోనూ పేదలకు వైద్య, విద్య అందుబాటులో ఉండేలా జగన్ ఏర్పాటు చేసిన ఆయా కళాశాలలు ఎంతో ఘనంగా ఉంటే.. ఇవేమీ కూటమి ముఖ్యమంత్రికి కానరావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా కళాశాలలను ప్రైవేటీకరించి కూటమి నేతలకు దారాదత్తం చేయాలని సీఎం చంద్రబాబు కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. జగన్ మత్స్యకారులకు అందించే మత్స్యకార భరోసాను కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. టూరిజంను అభివృద్ధి చేయకపోగా వాటితో పాటు ఇలాంటి జాతీయ సంపదలను కూటమి నేతలకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రైవేటీకరణ చేయడానికి సీఎం చంద్రబాబు పథకం రూపొందించారని పేర్కొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా మాట్లాడుతూ, ఏడాదిగా సంక్షేమ పథకాలను అరకొరగా అమలు చేసి సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అంటూ విజయోత్సవాలు చేసుకోవడానికి సిగ్గుండాలని విమర్శించారు. పార్టీ నేతలు చంద్రశేఖర్, తాడి సహదేవ్, మణికంఠ, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

మలికిపురం: మండలంలోని దిండిలో సోమవారం ఆవులు, గేదెలకు గాళ్లు (సలుపులు) టీకాల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వెంకటరావు పాల్గొని మాట్లాడారు.

ఆలమూరు: గాలికుంటు వ్యాధి నివారణకు నిర్వహించే టీకాల కార్యక్రమాన్ని ఆలమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత ప్రారంభించారు. ఈ టీకాలను వేయించడం ద్వారా వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చన్నారు.

మామిడికుదురు: గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నగరంలో రాజోలు సహాయ పశువైద్య సంచాలకులు డాక్టర్ కె.రవికుమార్, సర్పంచ్ జాలెం రమణకుమారి ప్రారంభించారు. అక్టోబర్ 15 వరకు నిర్వహిస్తామన్నారు.

కూటమి అసత్య ప్రచారం మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న శివ కుమార్

మలికిపురం: వైఎస్సార్ సీపీపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం మలికిపురంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ నాయకులు శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కూటమి చేసిన తప్పులను గత ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో శెట్టిబలిజ సామాజికవర్గ ఆత్మాభిమానం దెబ్బతినే విధంగా ఎటువంటి చీకటి జీవోలు కూడా జారీ చేయలేదని అన్నారు. కులాలను విచ్ఛిన్నం చేసి కులాల మధ్య కొంపటి పెట్టడం టీడీపీ నైజమన్నారు. కేవలం వైసీపీ ప్రభుత్వంలోనే బీసీలకు, శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. సమావేశంలో శెట్టి బలిజ సంఘ నాయకులు చెల్లుబోయిన బుచ్చియ్య, గుబ్బల రమేష్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో ఆత్మస్థైర్యం

రాజోలు: విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా ఆత్మస్థైర్యం పెంపొందించవచ్చని గోదావరి డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. అండర్–14 బాలుర ఖోఖో పోటీల్లో రాజోలు పాఠశాల విజేతగా, కాట్రేనిపాడు పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. అండర్–17 ఖోఖో పోటీల్లో బి.సావరం శోభన స్కూల్ విజేతగా, రాజోలు బాలుర ఉన్నత పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. అండర్–17 కబడ్డీ పోటీల్లో విజేతగా తాటిపాక ఉన్నత పాఠశాల జట్టు, రన్నర్‌గా కూనవరం పాఠశాల జట్టు నిలిచాయి. వాలీబాల్ కడలి ఉన్నత పాఠశాల విజేతగాను, రాజోలు బాలుర ఉన్నత పాఠశాల జట్టు రన్నర్‌గా నిలచాయి. అండర్–14, 17 విభాగం షార్ట్‌పుట్ పోటీల్లో బాలవంశీ, బి.సాయి అవినాష్, బి.కాశీమణికంఠ, కె.వర్మ, పి.స్వామి, ఎం.సందీప్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 16 నుంచి రాజోలు బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో బాలికలకు అండర్–14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు.

విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి

మలికిపురం: ఇంజినీరింగ్ రంగంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్యది చెరగని ముద్ర అని మలికిపురం ఎమ్‌వీఎస్‌జేఎస్, ఆర్‌వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద మహేశ్ అన్నారు. ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా కళాశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రపంచ ఓజోన్ డే నిర్వహణ

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం పురస్కరించుకుని ఏపీ ఎన్‌జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జీ.ప్రభావతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులతో ఆమె ఓజోన్‌కు కెమికల్ ఫార్ములా ఓ–3 ఆకారంలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, క్లోరోఫ్లోరో కార్బన్ల (సీఎఫ్ సీఎస్) వాడకాన్ని తగ్గించడం, ఎయిర్ కండిషనర్లు, ఫ్రిజ్‌లలో పర్యావరణానికి హానికరమైన రసాయనాలు వాడకం నియంత్రించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారా ఓజోన్ పొరను రక్షించుకోవచ్చని చెప్పారు. హెచ్ఎం ఎంజీకే శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వస్థ నారీ- సశక్తిపై అవగాహన

సఖినేటిపల్లి: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్‌పై అవగాహన సదస్సు సిబ్బందికి ఏర్పాటు చేశారు. సదస్సులో సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గాయత్రి మాట్లాడుతూ, ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకూ మండలంలో ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.

అయినవిల్లి: స్వస్థ నారీ సశక్తి పరివార్ ద్వారా మహిళలు, పిల్లలు ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మంగాదేవి తెలిపారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, గ్రామ హెల్త్ సెంటర్లలో ఆరోగ్య శిబిరాలను వివిధ శాఖల సమన్వయంతో ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో సోమవారం ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఆశ కార్యకర్తలందరూ మహిళా సాధికారత కోసం మహిళ శక్తి సంఘాలతో కలిసి చైతన్య సమావేశాలు ఏర్పాటు చేయాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ అన్నారు. సూచించారు.

జాతీయ అవార్డు అందుకున్న కళాకారుడు


జాతీయ అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు, కళా భూషణ్ మంగం సత్యనారాయణ డాక్టర్ నందమూరి తారక రామారావు జాతీయ అవార్డును అందుకున్నారు. మదర్ సర్వీస్ సొసైటీ మూడో వార్షికోత్సవ సభ విజయవాడలో సోమవారం జరిగింది. ఈ సభలో ప్రముఖ సినీ నటి రజిత షిండే, మూసా అలీఖాన్, ఎంపీహెచ్ సుబ్బారెడ్డి, మదర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ జర్నలిస్ట్ డాక్టర్ మల్లాది ప్రసాదరావు వంటి ప్రముఖుల చేతుల మీదుగా సత్యనారాయణ జాతీయ అవార్డు స్వీకరించారు. గతంలో సత్యనారాయణ పలు అవార్డులు అందుకున్నారు.

విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు

మామిడికుదురు: ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్ సర్వేలో భాగంగా అప్పనపల్లి ప్రధాన మోడల్ స్కూల్ 1, 2 తరగతులకు చెందిన విద్యార్థులకు సోమవారం ఫైలేరియా సంబంధిత పరీక్షలు చేశారు. మొత్తం 19 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చిందని డాక్టర్ శామ్యూల్ ప్రణయ్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం నయనాల రఘు రామయ్య, ఎంపీహెచ్ మేల్ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ బళ్ల నరసింహారావు, ఎంపీహెచ్ఈఓ హరిప్రసాద్, వైద్య సిబ్బంది, టీచర్స్ పాల్గొన్నారు.

ఆలమూరు: నేటి సమాజానికి ప్రమాదకరమైన ఫైలేరియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ఫైలేరియాసిస్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం వ్యాధి వ్యాప్తక అంచనా సర్వే జరిగింది. అందులో భాగంగా మూలస్థాన అగ్రహారం ఎంపీపీ పాఠశాల, మడికి రవీంద్ర ప్రైవేట్ పాఠశాలలో చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.లక్ష్మీ స్నేహలత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు పాల్గొని ఫైలేరియా పరీక్షలను పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా దశల వారీగా విద్యార్థులందరికి ఫైలేరియా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

కరవు భత్యం విడుదల చేయాలి

కొత్తపేట: పెన్షనర్లకు రావాల్సిన మూడు విడతల కరవు భత్యం వెంటనే విడుదల చేయాలని కొత్తపేట తాలూకా పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో సంఘ అధ్యక్షుడు కాశి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఏడిద సత్తిరాజు ఆర్థిక నివేదిక, వివిధ అంశాలను ప్రవేశ పెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

కొత్తపేట: వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డీఎస్పీ సుంకర మురళీమోహన్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ వర్తక సంఘాల వారితో పోలీస్ అధికారులు సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ, కొత్తపేటలో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నందున నిబంధనలు పాటిస్తూ షాపులు నడుపుకోవాలని సూచించారు. వచ్చే దీపావళి సందర్భంగా బాణాసంచా హోల్‌సేల్, తయారీదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆయా షాపుల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

రాజకీయ ఊసరవెల్లి 'డొక్కా'



రాజోలు: నోరు ఉంది కదా అని రాజకీయ భిక్ష పెట్టిన వారిపై విమర్శలు చేస్తే సహించేది లేదని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌పై రాష్ట్ర ప్రచార విభాగ అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన రాజోలులో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మెప్పు కోసం గతం మర్చిపోయి జగన్‌మోహన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి దయతో ఎమ్మెల్యే, మంత్రి పదవి పొంది వెంటనే మీరు టీడీపీలోకి వెళ్లిపోయారని డొక్కాకు గుర్తు చేశారు. వాటిన్నంటిని మర్చిపోయి జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఇచ్చి గుంటూరు జిల్లాకు పార్టీ అధ్యక్షుడిగా చేస్తే మీరేం చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్న పార్టీలోకి ఊసరవెల్లిలా వెళ్లిపోవడం అలవాటుగా మారిన మీరు తమ అధినేతను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

ముక్తేశ్వరంలో హిందీ భాషా దినోత్సవం

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గణేశ్వరరావు అధ్యక్షతన సోమవారం హిందీ జాతీయ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులచే బోధనోపకరణాల ప్రదర్శన నిర్వహించారు. ఎంఈవో పి.శ్రీనివాస్ దీనిని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ, పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు వీధి దుర్గారావు, షేక్ అమెజానీ, విద్యాకమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా మల్లికార్జునరావు బాధ్యతల స్వీకరణ



పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ మలికిపురం ఎంపీపీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేశారు. పదోన్నతిపై పి.గన్నవరం ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

ఎంపీడీఓగా మమత



అంబాజీపేట: స్థానిక ఎంపీడీవోగా బి.మమత సోమవారం బాధ్యతలను స్వీకరించారు. కాట్రేనికోన మండల డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై అంబాజీపేట ఎంపీడీఓగా వచ్చారు. గతంలో మమత ఈఓపీ ఆర్డీగా సేవలందించారు. ఇప్పటివరకు నరసింహం ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. మమతకు ఎంపీపీ వెంకటేశ్వరరావు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.